ఈనాడు
epaper.eenadu.net

## మెట్రో ఫేజ్-2

# మంజూరు చేయండి

- కేంద్ర మంత్రి ఖట్టర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి వినతి
- బ్రిటన్ మాజీ ప్రధాని బ్లెయిర్‌తో ముఖ్యమంత్రి భేటీ

5లో

- 'తెలంగాణ రైజింగ్ విజన్'పై బ్లెయిర్ సంస్థతో ఎంవోయూ

మంత్రి, ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల ఆధ్వర్యంలోని ఎపెక్స్ కౌన్సిల్‌లో చర్చించి అనుమతి పొందాలి. కానీ, బనకచర్ల విషయంలో ఏపీ వీటన్నింటినీ ఉల్లంఘిస్తోంది. వరదజలాల ఆధారంగా ఆ ప్రాజెక్టు చేపడుతున్నామంటున్న ఏపీ ప్రభుత్వ వాదన అభ్యంతరకరం. ...మిగతా 5లో

Date : 20/06/2025 EditionName : GREATER HYDERABAD PageNo :

ఈనాడు
epaper.eenadu.net

# మెట్రో ఫేజ్-2 మంజూరు చేయండి

## • కేంద్ర మంత్రి ఖట్టర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి వినతి



కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



టోనీబ్లెయిర్, రేవంత్‌రెడ్డిల సమక్షంలో ఒప్పంద పత్రాలు చూపుతున్న టీబీఐజీసీ, తెలంగాణ ప్రతినిధులు వివేక్, జయేశ్‌రంజన్. చిత్రంలో మంత్రి ఉత్తమ్, ఎంపీ రఘువీర్

ఈనాడు, దిల్లీ: హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టుకు సత్వరమే అనుమతి మంజూరు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు విజ్ఞప్తి చేశారు. సీఎం గురువారం ఇక్కడ కేంద్రమంత్రిని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. ‘వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో 76.4 కిలోమీటర్ల పొడవైన మెట్రో రెండోదశ అవసరం చాలా ఉంది. రూ.26,269 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఉమ్మడిగా చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇది కార్యరూపం దాలిస్తే నగరంలో రాకపోకలు వేగంగా సాగుతాయి. రహదారులపై రద్దీ తగ్గుతుంది. పర్యావరణ, సుస్థిరాభివృద్ధికి ఇది ఎంతో దోహదం చేస్తుంది. కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ సూచనల మేరకు డీపీఆర్‌లో అవసరమైన సవరణలు చేసి సమర్పించాం. ఈ ప్రాజెక్టుకున్న అత్యవసరతను దృష్టిలో ఉంచుకొని ఇతర శాఖల నుంచీ అవసరమైన అనుమతులు ఇప్పించండి” అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రికి విన్నవించారు.

## తెలంగాణ రైజింగ్’కు టోనీ బ్లెయిర్ అభినందన

సీఎం రేవంత్‌రెడ్డి తన దిల్లీ పర్యటనలో యునైటెడ్ కింగ్‌డమ్ మాజీ ప్రధానమంత్రి టోనీబ్లెయిర్‌తో భేటీ అయ్యారు. 1997-2007 మధ్య యూకే ప్రధానిగా పనిచేసిన అనంతరం రాజకీయాల నుంచి వైదొలగిన బ్లెయిర్.. టోనీబ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ ఛేంజ్ (టీబీఐజీసీ)ను స్థాపించారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల నాయకులకు విజన్, వ్యూహాల రచన, వాటి అమలులో సహకరించడం దీని లక్ష్యం. ఇలా భారత్‌లోని వివిధ రాష్ట్ర ప్రభుత్వాలకు సహకరించడానికి బ్లెయిర్ దిల్లీకి వచ్చిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆయనతో భేటీ అయ్యారు. సుమారు గంటపాటు జరిగిన ఈ సమావేశంలో.. ‘తెలంగాణ రైజింగ్ 2047’ లక్ష్యంలోని కీలకాంశాలను బ్లెయిర్‌కి ముఖ్యమంత్రి వివరించారు. ఈ విధానపత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వ రెండో వార్షికోత్సవమైన డిసెంబరు 9న విడుదల చేయబోతున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యాల గురించి వివరించారు. రైతులు, యువత, మహిళల ఆర్థికాభివృద్ధితోపాటు, మానవాభివృద్ధి సూచికలను మెరుగుపరిచేందుకు తీసుకుంటున్న చర్యల గురించి చెప్పారు. రాష్ట్రాన్ని పట్టణ, శివారు, గ్రామీణ జోన్లుగా విభజించి సూక్ష్మప్రణాళికలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టబోతున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికలను బ్లెయిర్ అభినందించారు. భారత్ ఫ్యూచర్ సిటీ, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీల గురించి ఆయన ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. ‘తెలంగాణ రైజింగ్ విజన్’ రూపకల్పనతోపాటు, దాని అమలులో పాలుపంచుకోవడానికి టీబీఐజీసీ, తెలంగాణ ప్రభుత్వం అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ సమావేశాల్లో రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీలు మల్లురవి, రఘువీర్‌రెడ్డి, దిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్‌రెడ్డి, రాష్ట్ర పారిశ్రామిక పెట్టుబడుల విభాగం సీఈఓ జయేశ్‌రంజన్, పారిశ్రామిక, వాణిజ్య విభాగం ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, మెట్రో ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి, కేంద్ర ప్రాయోజిత ప్రాజెక్టుల సమన్వయ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, టీబీఐజీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

Date : 20/06/2025 EditionName : GREATER HYDERABAD PageNo :